మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును సన్మానిస్తున్న ఉప్పల వెంకటేశ్

మాజీ మంత్రిని కలిసిన ఉప్పల

కల్వకుర్తి, జూన్ 30 : మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును సోమవారం కల్వకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలతో కలిసి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ అధినేత, మిషన్ భగీరథ మాజీ వైస్‌చైర్మన్ ఉప్పల వెంకటేశ్ మర్యాద పూర్వకంగా కలిశారు. కల్వకుర్తి నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను మాజీ మంత్రి దృష్టికి తీసుకు వచ్చినట్లు ఉప్పల తెలిపారు. ఎంపీపీ శ్రీశైలంగౌడ్, బీఆర్ఎస్ నాయకులు కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, నరేశ్‌గౌడ్, ప్రశాంత్, కోటేశ్, బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.

గువ్వలకు శుభాకాంక్షలు

కల్వకుర్తి, జూన్ 30 : అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు సోమవారం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ పెద్దమ్మ గుడి వద్ద గువ్వలకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

గువ్వలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉప్పల

జిల్లాలో 306.9 మి.మీ. వర్షపాతం

నాగర్‌కర్నూల్, జూన్ 30 : నాగర్‌కర్నూల్ జిల్లాలో శనివారం సాయంత్రం, రాత్రి కురిసిన వర్షానికి జిల్లా వ్యాప్తంగా సగటున 15.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఎలాంటి ఉరుములు, మెరుపులు లేకుండా గంటపాటు కురిసిన వర్షంతో పెద్దకొత్తపల్లి, వంగూరు మండలాల్లో మినహా మిగతా అన్ని మండలాల్లో నూ వర్షపాతం నమోదైంది. జిల్లా మొత్తం 306.9 మి.మీ వర్షపాతం కురవగా సగటున 15.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు వెల్లడించారు. జిల్లాలోని తిమ్మాజిపేట మండలంలో 29.6 మి.మీ, బిజినేపల్లిలో 45.2 మి.మీ, నాగర్‌కర్నూల్‌లో 34.8 మి.మీ, తాడూరులో 24.0మి.మీ, ఊర్కొండలో 22.6మి.మీ, వెల్దండలో 32.4 మి.మీ, చారకొండలో 2.0మి.మీ, కల్వకుర్తిలో 13.8మి.మీ, తెలకపల్లిలో 24.2 మి.మీ, ఉప్పునుంతలలో 10.2మి.మీ, అచ్చంపేటలో 22.6మి.మీ, అమ్రాబాద్‌లో 18.6 మి.మీ, పదరలో 13.0మి.మీ, బల్మూర్‌లో 3.8మి.మీ, లింగాలలో 2.2 మి.మీ, కోడేరులో 2.6 మి.మీ, కొల్లాపూర్‌లో 0.2మి. మీ, పెంట్లవెల్లిలో 5.0 మి.మీ. మొత్తం 306.9 మి.మీ వర్షపాతం కురవగా సగటున 15.5 మి.మీటర్లుగా నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కల్వకుర్తిలో సమావేశమైన 1997-98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు

కల్వకుర్తి, జూన్ 30 : కల్వకుర్తి పట్టణంలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం వంగూర్ జెడ్పీహెచ్ఎస్‌లో 1997-1998 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు మనోహర్‌రావు, మల్లయ్య, శ్రీనివాసులు, చెన్నకేశవులు, చంద్రారెడ్డి, రాజబాబు, బలరాములును పూలమాలలు, శాలువాతో సన్మానించారు. అంతకుముందు తమ పాఠశాల నాటి అనుబంధాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

వాహనాలను తనిఖీ చేస్తున్న ఏఎస్సై శ్రీనివాసులు, సిబ్బంది

- ఏఎస్సై శ్రీనివాసులు

లింగాల, జూన్ 30 : మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఏఎస్సై శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం మండలంలోని మగ్దూంపూర్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఫలితంగా బాధిత కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుందన్నారు. వాహనదారులు లైసెన్స్, వాహనాల పత్రాలను తమ వెంట ఉంచుకోవాలని సూచించారు. అదేవిధంగా సీట్‌బెల్ట్, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. తాగి వాహనం నడుపుతూ పట్టుబడితే జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS
TEACHERS AVAILABLE
★KERALA TEACHER'S are available for immediate appointment. Schools can contact for teacher's. Cotact: 7012044141
NT-MBNR
ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

గుట్టలు మాయం

- నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పట్టించుకోని అధికారులు

కోడేరు ఊరగుట్ట నుంచి మట్టిని తరలించటానికి సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు (ఫైల్)

కోడేరు జూన్ 30 : కోడేరు మండలంలోని వివిధ గ్రామాల్లో గుట్టలను తవ్వి మట్టిని విక్రయిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలోని రాజాపూర్ శివారులో ఉన్న తువ్వరాళ్ల గుట్ట, నాగులపల్లి శివారులోని కుమ్మరివాళ్ల బండగుట్ట, కోడేరు ఊరగుట్ట, ఎంజీకేఎల్ఐ లిఫ్టు-2 వద్ద ఉన్న గుట్ట, పసుపుల శివారులోని బోటుకోనితిప్పగుట్ట, ఎంజీకేఎల్ఐ బ్రాంచి కాల్వ వెంట తదితర ప్రాంతాల్లోని గుట్టలను నిబంధనలకు విరుద్ధంగా తవ్వి రూ.లక్షల విలువ చేసే మొరాన్ని అక్రమంగా తరలించుకుపోవడంతో గుట్టలు క్రమంగా కరిగిపోతున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగ తవ్వి మట్టిని అమ్ముకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మట్టే కదా అని అధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమార్కులకు ఆ మట్టే మూడు పువ్వులు ఆరుకాయలుగా ఆదాయం తెచ్చిపెడుతున్నది. గత కొంత కాలంగా ఆయా ప్రాంతాల నుంచి మట్టిని టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. రోడ్డు నిర్మాణాలు, ఇండ్ల నిర్మాణాల బరంతికి, రియల్ ఎస్టేట్ లేఅవుట్ల చదును తదితర వాటికి మొరాన్ని తవ్వి విక్రయిస్తున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు మామూలుగా వ్యవ హరిస్తుండడంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. అదేవిధంగా ఎంజీకేఎల్ఐ బ్రాంచి కాల్వకు ఇరువైపులా ఉన్న మట్టిని సైతం కొంత మంది వ్యాపారులు తవ్వి విక్రయిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ప్రతి రోజూ వందల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లతో మొరం తరలింపు జరుగుతుండటంతో రోడ్లన్నీ గుంతల మయంగా మారుతున్నాయని, పెద్దపెద్ద రాళ్లు సైతం వాహనాల నుంచి కిందపడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి..

అక్రమంగా మొరాన్ని (మట్టిని) తరలిస్తుండటంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నది. నిబందనల ప్రకారం ఈ తవ్వకాలకు గనుల శాఖ నుంచి అనుమతులు తీసుకొని మట్టిని తరలించాల్సి ఉండగా అవేవీ పాటించకుండా ఇష్టానుసారంగా మట్టిని తవ్వి తరలిస్తున్నారు. నిబంధనల ప్రకారం గనులశాఖకు రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది. కానీ వ్యాపారులు అవేమీ పట్టించుకోకుండా మట్టిని అక్రమంగా తీసుకెళ్తుండడంతో ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం తగ్గిపోతున్నది.

చర్యలు తీసుకుంటాం

మొరం అక్రమ తవ్వకాల తరలింపుపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా మట్టిని తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు అక్రమ మట్టి తరలింపును అడ్డుకట్ట వేస్తాం.

– విజయ్‌కుమార్, తాసీల్దార్

రాజాపూర్ శివారులోని తువ్వరాళ్ల గుట్టను తవ్విన దృశ్యం (ఫైల్)

నాగులపల్లి శివారులో గుట్ట మట్టిని తవ్వుతున్న దృశ్యం (ఫైల్)

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

పీఏసీసీఎస్ మహాజన సమావేశంలో మాట్లాడుతున్న అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ

చారకొండ, జూన్ 30 : రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆదివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మహాజన సమావేశం సింగిల్ విండో చైర్మన్ గురువయ్యగౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ రైతు భరోసా పథకంలో రైతుల భాగస్వామ్యం, వారి సలహాలు, సూచనలు తీసుకొని మార్గదర్శకాలు ఉంటాయని చెప్పారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2లక్షల రుణమాఫీ ఎలాంటి షరతులు లేకుండా ఆగస్టు 15లోపే అమలు చేస్తామన్నారు. అనంతరం సింగిల్ విండో చైర్మన్ గురువయ్యగౌడ్, డైరెక్టర్లు కలిసి ఎమ్మెల్యేను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి రఘునందన్‌రావు, డివిజన్ అసిస్టెంట్ రిజిస్ట్రర్ భాగ్యమ్మ, సీఈవో వెంకటయ్య, డైరెక్టర్లు కొండల్‌గౌడ్, జగన్, పాండు, రాజయ్య, ఏఈవోలు వంశీ, రేణుక, మాజీ జెడ్పీటీసీ లు వెంకట్‌గౌడ్, భీముడునాయక్ పాల్గొన్నారు.

అర్హులందరికీ 'రైతుభరోసా'

అచ్చంపేట రూరల్, జూన్ 30 : అర్హులందరికీ రైతు భరోసాను అందిస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ఆదివారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అచ్చంపేట ఆధ్వర్యంలో నిర్వహించిన అత్యవసర సర్వసభ్య సమావేశం మహా జనసభకు డీఏవో చంద్రశేఖర్‌తో కలిసి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రెండు పంటలకు కలిపి రూ.15వేలు పెట్టుబడి సాయంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంత్రియానాయక్, విండో వైస్‌చైర్మన్ పరమేశ్, సీఈవో ఎల్లయ్య, డైరెక్టర్లు హన్మంతునాయక్, శ్రీనివాసులు, సతీష్, కౌన్సిలర్లు గౌరీశంకర్, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

గోకారం చెరువును పునరుద్ధరించాలి

చారకొండ, జూన్ 30 : మండలంలోని గోకారం చెరువును పునరుద్ధరించాలని కోరుతూ సీపీఐ జిల్లా సమితి సభ్యుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకారం చెరువును పునరుద్ధరిస్తే 12వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అదేవిధంగా పరిసర ప్రాంతాల్లో ఉన్న దాదాపు 15 గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని, దీంతో గోకారం, చంద్రాయన్‌పల్లి గ్రామాల్లో ఉన్న మత్స్య కార్మికులకు కూడా జీవనోపాధి దొరుకుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి గోకారం చెరువు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీపీఐ గ్రామ కమిటీ కార్యదర్శి ఏసారపు అశోక్‌గౌడ్, రైతు సంఘం అధ్యక్షుడు మద్దినారాయణరెడ్డి, నాయకులు మొగిళ్ల శ్రీను, మహబూబ్‌అలీ, ముత్యాలుగౌడ్, బాలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

లింగాల, జూన్ 30 : మండలకేంద్రంలోని పీఏసీసీఎస్‌లో సోమవారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు విండో చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ముఖ్య కార్యనిర్వహణాధికారి పాండు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశానికి వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

అధ్వానంగా అల్లీపూర్-వడ్డెమాన్ రోడ్డు

- అవస్థలు పడుతున్న వాహనదారులు

బిజినేపల్లి, జూన్ 30 : మండలంలోని అల్లీపూర్-వడ్డెమాన్ మార్గమధ్యంలో ఉన్న రోడ్డు అధ్వానంగా మారింది. సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవునా ఈరోడ్డుపై గుంతలు ఏర్పడడంతో వాహనదారులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. వర్షం కురిస్తే రోడ్డుపై గుంతల్లో నీరు నిలిచి తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు వేయాలని కోరుతున్నారు.

గుంతలమయంగా మారిన రోడ్డు

జానపద కళాకారుల ఆధ్వర్యంలో కోలాట పోటీలు

జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న జానపద కళాకారులు

నాగర్‌కర్నూల్, జూన్ 30 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం జానపద కళాకారుల ఆధ్వర్యంలో పట్టణంలో జిల్లాస్థాయి కోలాట పోటీలు నిర్వహించారు. కొండల్‌రావు ఫౌండేషన్ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల రాష్ట్ర, జిల్లా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలను నిర్వహించారు. పోటీల్లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు సంబంధించి 20మండలాలకు సంబంధించిన జానపద కళాకారుల పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి 35 కోలాట బృందాలు పాల్గొన్నాయి. అంతకుముందు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లాలోని జానపద కళాకారులు పాల్గొన్నారు.

ఆరెకటికల సమస్యలు పరిష్కరించాలి

అచ్చంపేట రూరల్, జూన్ 30 : దేశంలోని ఆరెకటికల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని ఆలిండియా కటిక్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని తమ కార్యాలయంలో జాతీయ కార్యదర్శి బాలాజీ అధ్యక్షతన రాష్ట్ర ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మెజారిటీ రాష్ట్రాల్లో ఎస్సీ జాబితాలో ఉన్న ఆరెకటికలు అన్ని రంగాల్లో వెనుకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకోసం భవిష్యత్ కార్యాచరణను రూపొందించడానికి దక్షిణ భారత కటిక్ సంఘం ఆధ్వర్యంలో 2, 3 తేదీల్లో ఢిల్లీలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మురళి, భాస్కరన్ బాలాజీ, రాధాకృష్ణ, హరి, సూల్తాన్‌జీ, రఘుచౌదరి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

బల్మూరులో గువ్వల జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న నేతలు

ఘనంగా గువ్వల జన్మదిన వేడుకలు

వంగూరు/చారకొండ/ బల్మూర్, జూన్ 30 : అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు జన్మదినాన్ని ఆదివారం ఘ నంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులతో కలిసి గువ్వల డిండి ప్రాజెక్టు వద్ద నున్న మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు, శాలువాలు, బొకే లు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కేటీఆర్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు సురేందర్, నాయకులు అంజి, రాజు, రవి, లక్ష్మణ్, నిరంజన్, మల్లేశ్, నిరంజన్, బాలస్వామితోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే గువ్వలను చారకొండ బీఆర్ఎస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు అల్వాల్ ఆంజనేయులుగౌడ్, తన్నీరు రామకృష్ణ, రమేశ్, సలీం, శ్రీశైలం, జంతుక మల్లేశ్ ఉన్నారు. బల్మూరు మండలంలో బీ ఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విండో చైర్మన్ నర్సయ్య, నాయకు లు నాగయ్య, రాములు, తిరుపతయ్య, రఫీ, సురేశ్, బాలరాజు, ముస్తాక్, మల్లేశ్, వెంకటయ్య పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

కల్వకుర్తి, జూన్ 30 : మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి జెడ్పీటీసీ, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీలక్ష్మీ గార్డెన్‌లో మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమయ్యే ఆత్మీయ సమ్మేళనంలో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా గెలుపొందిన నవీన్‌కుమార్‌రెడ్డితో పాటు కల్వకుర్తి నియోజకవర్గంలోని ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యులకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఉప్పల చారిటబుల్ ట్రస్టీ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఘనంగా సుదర్శన హోమం

స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

బిజినేపల్లి, జూన్ 30 : మండల కేంద్రమైన బిజినేపల్లిలోని ఆనందగిరి గోదాసమేత లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సుదర్శన హోమం అర్చకుల వేదమంత్రోచ్చరణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పారాయణ, ప్రబంధపారాయణ, అగ్ని ప్రతిష్ఠ, కలశస్థాపన, ధ్వజారోహణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా విష్ణుసహస్ర పారాయణం, బేరీ పూజా, హోమం, బలిహరణంతోపాటు గరుడవాహనసేవపై ఉత్సవ విగ్రహాల ఊరేగింపు ఎదుర్కోళ్లు వంటి కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

నేడు జెడ్పీ చైర్‌పర్సన్ వీడ్కోలు సభ

నాగర్‌కర్నూల్, జూన్ 30 : నాగర్‌కర్నూల్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవీ కాలం పూర్తవడంతో సోమవారం జిల్లా కేంద్రంలోని వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు జెడ్పీ ఇన్‌చార్జి సీఈవో గోపాల్‌నాయక్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు స్థానిక డీకేఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించే ఈ వేడుకకు విశిష్ట అతిథిగా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి జూపల్లి కృష్ణారావు, ముఖ్య అతిథులుగా ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీలు దామోదర్‌రెడ్డి, సురభి వాణిదేవి, గోరటి వెంకన్న, టీచర్స్ శాసన మండలి సభ్యులు ఏవీఎన్‌రెడ్డి, లోకల్ బాడీస్ ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, నారాయణరెడ్డి, అనిరుధ్‌రెడ్డిల ఆధ్వర్యంలో జెడ్పీ చైర్‌పర్సన్‌ను ఘనంగా సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

3న మైసమ్మ ఆలయంలో వేలం పాట

పెద్దకొత్తపల్లి, జూన్ 30 : మండలంలోని నాయినోనిపల్లి మైసమ్మ ఆలయం వద్ద తైబజార్ వసూలు, పూజా సామగ్రి, తలనీలాలు, ప్రసాదం అమ్మకం, కొబ్బరికాయలు, వాహనాల పార్కింగ్ రుసుము వసూలు కోసం వేలంపాట నిర్వహిస్తున్నట్లు చైర్మన్ శ్రీనివాసులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల టెండర్‌దారులు 3వ తేదీన మహబూబ్‌నగర్ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఆలయ అధికారులను సంప్రదించాలన్నారు.

భారత్ గెలుపుపై సంబురాలు

కొల్లాపూర్‌లో సంబురాలు జరుపుకుంటున్న యువకులు

పెంట్లవెల్లి, జూన్ 30 : టీ20 ప్రపంచ కప్‌ను భారత క్రికెట్ జట్టు గెలువడంపై ఆదివారం పెంట్లవెల్లి, కొల్లాపూర్ మండల కేంద్రాల్లో క్రీడా అభిమానులు సంబురాలు నిర్వహించారు. పటాకులు కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. పెంట్లవెల్లిలోని పురవీధుల గుండా జాతీయ జెండాతో జై భారత్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు.

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి

బిజినేపల్లి, జూన్ 30 : చేపలవేటకు వెళ్లి చెరువులోపడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పాలెం గ్రామంలో ఆదివారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వట్టెం గ్రామానికి చెందిన రాములు(38) గత శనివారం ఇంటినుంచి చేపల వేటకు వెళ్లగా పాలెం చెరువులో ప్రమాదవశాత్తుపడి మృతి చెందినట్లు వెల్లడించారు. చుట్టుపక్కల వారు గమనించి బయటకు తీసేసరికి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగశేఖర్‌రెడ్డి తెలిపారు.